
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



సోమశిలలో 23.74 టీఎంసీలు

ఆత్మకూరు: సోమశిల జలాశయంలో శనివారానికి 23.742 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 576 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,510
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,675
నవర (8 గ్రాములు)	రూ.45,400

గరిష్టం/కనిష్టం
37.3 /28.0

వాతావరణం

వాతావరణంలో తేమ 50 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం ఆదివారం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

98.82 శాతం పింఛన్ల పంపిణీ



నారాయణ హాస్పిటల్లో జానకిరామ్‌కు పింఛన్‌ను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ చలమయ్య

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. ఐదో రోజు శనివారానికి 98.82 శాతం మంది లబ్ధిదారులకు నగదును అందజేశారు. 3,03,501 మందికి గానూ 2,99,930 మందికి పంపిణీ చేశారు. మొత్తం రూ.83 కోట్లను అవ్వాతాతలకు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

వెంకటాచలం: పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి కోరారు. ఇంకుడు గుంతలు తవ్వడం, మొక్కల పెంపక ఆవశ్యకతపై కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షపు నీరు వృథా కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారం - ఎఫ్‌ను అప్‌లోడ్ చేయాల్సిందే

నెల్లూరు(బారకాసు): పీసీపీఎన్‌డీటీ చట్టం, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఫారం - ఎఫ్‌ను సంబంధిత వెబ్ పోర్టల్లో రోజూ విధిగా అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసినా ఆశించిన స్పందన రావడం లేదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు ఐదు రెట్ల జరిమానాను విధిస్తామని స్పష్టం చేశారు.

చేనేతల ర్యాలీ రేపు

నెల్లూరు(మినీబైపాస్): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు చేనేతల ర్యాలీని సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహించనున్నామని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆనంద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాల స్టాల్ వద్ద చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఈ నెల 13 వరకు నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఒకటో యూనిట్లో 440, రెండో యూనిట్లో 425 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాలతో మూడో యూనిట్లో ఉత్పత్తిని నిలిపేశామని ఇంజినీర్లు శనివారం తెలిపారు.

చకచకా ప్రాజెక్టులు..

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. సాగునీటికి రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల పూర్తికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఫలితంగా కీలకమైన సంగం, నెల్లూరు బ్యారేజీలు పూర్తయ్యాయి. మరోవైపు సోమశిల హైలెవల్ కెనాల్, ఉత్తర కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా నత్తనకడన సాగిన ప్రాజెక్టు పనులు ప్రస్తుతం ఊపందుకోవడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

అధిక ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- గత ప్రభుత్వ హయాంలో చంద్ర గ్రహణం
- చంద్రబాబుదంతా ప్రచారార్భాటమే
- వాస్తవాలను విస్మరించి అసత్యాల వ్యాప్తి



పెన్నా బ్యారేజీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగం నిర్వీర్యమైంది. ఏ ప్రాజెక్టునూ పూర్తి చేసిన దాఖలాల్లేవు. టీడీపీ ఐదేళ్ల కాలంలో కరువు విలయతాండవం చేయడంతో రెండు కార్ల పంటలు పండలేదు. 'ప్రాజెక్టుల పరిశీలన.. యుద్ధభేరి' అంటూ మాజీ సీఎం చంద్రబాబు జిల్లాలో సమీక్షను ఏర్పాటు చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మీ హయాంలో పూర్తి చేసిన ఒక్క ప్రాజెక్టునైనా చూపగలరా అని ప్రశ్నిస్తున్నారు.

ఆనం సంజీవరెడ్డి సోమశిల లింక్ కెనాల్

సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు ద్వారా జలాశయం నుంచి సాగునీటి కోసం 4.5., తాగునీటికి 0.5 టీఎంసీలను మళ్లించేందుకు ఆనం సంజీవ రెడ్డి సోమశిల లింక్ కెనాల్‌ను ప్రతిపాదించారు. సోమశిల ఉత్తర కాలువ రెండో పర్లాంగు నుంచి ప్రారంభమవుతుంది. 90 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యంగా ప్రారంభించారు. 58 గ్రామాలకు సోమశిల జలాలను అందించే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టుకు మొదటి విడతలో రూ.840.9 కోట్లు అవసరం. ఇప్పటికే రూ.604.5 కోట్లను వెచ్చించగా, 62.38 శాతం పనులు పూర్తయ్యాయి. టీడీపీ హయాంలో మొదటి దశను పూర్తి చేయలేని దుస్థితి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రెండో దశ పనులూ వేగంగా జరుగుతున్నాయి.

సోమశిల, కండలేరు వరద కాలువ ఆధునికీకరణ

సోమశిల - కండలేరు వరద కాలువ ఆధునికీకరణకు ప్రస్తుత ప్రభుత్వం రూ.960 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. సోమశిల - కండలేరు వరద కాలువ నీటి సామర్థ్యం ఒక టీఎంసీ మాత్రమే. ఏటా వరదలొచ్చే సమయంలో మిగులు జలాలు సముద్రం పాలయ్యేవి. ఈ క్రమంలో మిగులు జలాలు వృథా కాకుండా రోజుకు రెండు టీఎంసీలు వెళ్లేలా ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. 45 కిలోమీటర్ల పొడవు కలిగిన కాలువ వెడల్పు పనులను రూ.960 కోట్లతో చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు పురోగతిలో ఉన్నాయి.

సర్వేపల్లి కాలువకు రూ.99.95 కోట్లు



నగరంలో సర్వేపల్లి కాలువ రక్షణ గోడల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.99.95 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు పనులు 60 శాతం పూర్తికాగా, రూ.60 కోట్లను వెచ్చించారు.

సోమశిల ఆప్రాన్ పనులు

సోమశిల జలాశయం వద్ద వరదలతో దెబ్బతిన్న ఆప్రాన్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.117 కోట్లు మంజూరు చేసింది. రానున్న వరదల సమయానికి ఎలాంటి ఇబ్బందిలేకుండా పనులు జరుగుతున్నాయి. శివాలయాన్ని ఆనుకొని కుడి వైపు ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపునకు రూపకల్పన చేశారు. సోమశిల జలాశయ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల సామర్థ్యం గతంలో కంటే మరింత పెరిగినా భద్రతకు ఎలాంటి ఢోకా ఉండదు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయి.


నెల్లూరు బ్యారేజీ జాతికి అంకితం

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో నెల్లూరు బ్యారేజీ పనులను ప్రారంభించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు విస్మరించాయి. ఈ క్రమంలో పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారు. ఈ బ్యారేజీ ద్వారా సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువల కింద సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని 77 గ్రామాల్లో 99,525 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. నిత్యం 0.4 టీఎంసీలను విడుదల చేయడం ద్వారా సాగు, తాగునీరందుతుంది. వాస్తవానికి బ్యారేజీ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణ పనులను 2008లో రూ.147.2 కోట్లతో ప్రారంభించారు. వైఎస్సార్ హయాంలో రూ.86.92 కోట్లు వెచ్చించారు. ఆపై నిర్మాణం అటకెక్కింది. టీడీపీ హయాంలో రూ.71.54 కోట్లనే ఖర్చు చేశారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి డిజైన్లలో మార్పులు చేసి అంచనా వ్యయాన్ని రూ.274.83 కోట్లకు సవరించారు. అయినా పనులు చేపట్టడంలో విఫలమయ్యారు.

సంగం బ్యారేజీ పూర్తి

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ ద్వారా పెన్నా జలాలను సంగం వద్ద నిల్వ చేసి ఆయకట్టుకు అందించేలా ప్రణాళికను రూపొందించారు. 3.85 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే ఈ ప్రాజెక్టుకు రూ.335.8 కోట్లతో అంచనాలు రూపొందించారు. వైఎస్సార్ హయాంలో రూ.30.85 కోట్లను వెచ్చించారు. ఆపై టీడీపీ హయాంలో కాంట్రాక్టర్ నుంచి కమీషన్ల కోసం సులభమైన పనులకు రూ.86.1 కోట్లను ఖర్చు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.131.12 కోట్లను వెచ్చించి పూర్తి చేసింది.

ఉత్తర కాలువకు రూ.960 కోట్లు



మెట్ట ప్రాంత సస్యశ్యామలానికి ఉత్తర కాలువ ఆధునికీకరణకు రూ.960 కోట్లను మంజూరు చేసింది. సోమశిల జలాశయం నుంచి కందుకూరులోని రాళ్లపాడు జలాశయం వరకు ఉన్న ఉత్తర కాలువ నీటి విడుదల సామర్థ్య పెంపునకు శ్రీకారం చుట్టింది. సుమారు 101 కిలోమీటర్ల పొడవున్న కాలువ నీటి సామర్థ్యాన్ని 350 నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా ఆధునికీకరిస్తున్నారు. పనులు 30 శాతం పూర్తయ్యాయి. 1.1 లక్షల ఎకరాలకు ఆయకట్టు పెరగనుంది.

పుంగనూరు ఘటనకు చంద్రబాబుదే బాధ్యత

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: పుంగనూరు ఘటనకు ప్రతిపక్ష నేత చంద్రబాబుదే బాధ్యత అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కక్షలకు చంద్రబాబు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన వ్యక్తి పరుష పదజాలంతో దూషించడం సబబు కాదన్నారు. ప్రజల మధ్య గొడవలు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని.. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ప్రభుత్వంపై బురదజల్లే యత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. పుంగనూరులో జరిగిన ర్యాలీలో తన వాహనంలోనే మారణాయుధాలు పెట్టుకొని గొడవలకు తెరలేపింది చంద్రబాబేనని ఆరోపించారు. ఈ గొడవను అధికార పక్షానికి అంటగట్టడమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ ఎన్ని డ్రామాలాడినా ప్రజల ఆశీస్సులను పొందలేరన్నారు. ఏడు నెలల క్రితం కందుకూరులో చంద్రబాబు పర్యటనలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో మృతి చెందిన వారికి టీడీపీ తరపున రూ.15 లక్షలను అందిస్తామని హామీ ఇచ్చారని, అది కేవలం ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బాధిత కుటుంబాలకు పరిహారాన్ని అందించి ఆదుకోవాలన్నారు. డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులు రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9న మెగా జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ పీజీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్నామని కళాశాల డైరెక్టర్ తనూజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగానికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు, చివరి సెమిస్టర్ చదువుతున్న వారు అర్హులని, 25 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.2.6 లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు అందుతుందని వివరించారు. రాష్ట్రంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల వారు బయోడేటా, సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని కోరారు. వివరాలకు 91820 20936 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీసీఆర్సీ మంజూరులో జిల్లా ఫస్ట్

- 128.8 శాతం లక్ష్య సాధన
- కలెక్టర్‌కు చీఫ్ సెక్రటరీ అభినందన



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ఖరీఫ్ - 2023కు సంబంధించిన కౌలు రైతుల ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్సీ) మంజూరులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జిల్లా నిలిచిన నేపథ్యంలో కలెక్టర్ హరినారాయణన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అభినందించారు. గృహ నిర్మాణాలు, రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాల పురోగతి, తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం నిర్వహించారు. కౌలు రైతుల ధ్రువీకరణ కార్డుల జారీలో జిల్లాకు 22,950 మేర లక్ష్యాన్ని నిర్దేశించారని, అయితే 29,576 కార్డులను మంజూరు చేసి 128.87 శాతం లక్ష్యాన్ని సాధించడంపై కలెక్టర్‌కు అభినందనలను తెలియజేశారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్, డ్వామా, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజు, వెంకట్రావు, శ్రీనివాసులు, సీపీఓ రాజు, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, పశు సంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు, తదితరులు హాజరయ్యారు.

ఉమ్మడి పౌరస్మృతి లౌకికవాదానికి వ్యతిరేకం



మాట్లాడుతున్న లక్ష్మణరావు

నెల్లూరు(లీగల్): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న ఉమ్మడి పౌరస్మృతి విధానం లౌకికవాదానికి వ్యతిరేకమని ఎమ్మెల్సీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) 12వ జిల్లా స్థాయి సమావేశాలను నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి వస్తే వివిధ మతాలు, కులాల ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదేళ్లలో ఒకే విధానం అనే పాలసీ నడుస్తోందని, ఫలితంగా 11 రకాల పన్నులను ఒకే గొడుగు కిందికి తెచ్చి జీఎస్టీని అమల్లోకి తీసుకొచ్చారని తెలిపారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, ఏఐఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. 21వ లా కమిషన్ ప్రస్తుతం పౌరస్మృతిని అత్యవసరంగా తీసుకురావాల్సిన అవసరం లేదని సిఫార్సు చేసినా, బీజేపీ ప్రభుత్వం దూకుడుగా వెళ్తోందని తెలిపారు. విభిన్న సంప్రదాయాలు, మతాలు ఉన్న దేశంలో ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. న్యాయవాదులకు డెత్ బెనిఫిట్‌ను రూ.15 లక్షలకు పెంచాలని, వివిధ కోర్టుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని నియమించారు. సమావేశానికి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది రమణారెడ్డి, జిల్లా శాఖ అధ్యక్షుడు విజయమోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ న్యాయ కళాశాలలో జుడీషియల్ విచారణ

నెల్లూరు (టౌన్) : వీఆర్ న్యాయ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో చోటుచేసుకున్న అవకతవకలపై విశ్రాంత జిల్లా న్యాయమూర్తి టీ రామరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ 3న వీఆర్ న్యాయ కళాశాలలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, విచారణ చేపట్టాలని ఓ న్యాయవాది భారత రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఏపీ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్, తదితరులకు లేఖలు పంపారు. ఈ విషయంపై స్పందించిన ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ విచారణ బాధ్యతలను విక్రమ సింహపురి యూనివర్సిటీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో జుడీషియల్ విచారణ కమిటీ చైర్మన్‌గా విశ్రాంత జిల్లా న్యాయమూర్తి టీ రామరాజుతో పాటు మరికొందరిని సభ్యులుగా నియమించారు. వీరు వీఆర్ న్యాయ కళాశాలలో గురువారం నుంచి శనివారం వరకు విచారణ చేపట్టారు. కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, విద్యార్థులను విచారించారు. కళాశాలలో ఎన్ని సెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజూ ఎంతమంది విద్యార్థులు కళాశాలకు వస్తున్నారని ఆరా తీసినట్లు తెలిసింది. న్యాయ విద్యార్థుల సర్టిఫికెట్లు, హాజరుపట్టీలను పరిశీలించినట్లు సమాచారం.

అన్నీ అక్రమాలే ...

వీఆర్ లా కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటా కింద నిబంధనలను అతిక్రమించి పలువురికి సీట్లు ఇచ్చారని విద్యార్థులు, న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఆధార్‌కార్డులను సైతం మార్ఫింగ్ చేసి తమిళనాడుకు చెందిన కొందరికి సీట్లు ఇచ్చారని చెబుతున్నారు. విక్రమ సింహపురి వర్సిటీతో పాటు ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు కూడా సీట్లు ఇచ్చినట్లు తెలిసింది. వీరందరికీ రెగ్యులర్‌గా కళాశాలకు రావాల్సిన అవసరం లేదని చెప్పి సీట్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అదే విధంగా కళాశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థులకు సైతం 70 శాతం హాజరుతో సర్టిఫికెట్లు ఇచ్చినట్లు సమాచారం. వీటన్నింటిపైన జ్యుడీషియల్ కమిటీ విచారణ జరిపినట్లు తెలిసింది.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని..



రాజును సన్మానిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• 12338 కి.మీ బైక్ యాత్ర చేపట్టిన అభిమాని

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలవాలని కాంక్షిస్తూ జలదంకి మండలం అన్నవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ వీరాభిమాని అడవికొట్టు రాజు మే 5న చేపట్టిన బైక్‌యాత్ర శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 12,338 కిలోమీటర్ల మేర బైక్ యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. పార్టీ సంక్షేమ పథకాలను మైక్ ద్వారా ప్రజలకు వివరిస్తూ యాత్ర సాగించినట్లు చెప్పారు. త్వరలో ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి పల్లె తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజును జలదంకిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినయ్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు.

హత్య కేసులో నిందుతుడి అరెస్ట్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవినాయక్

సంగం: ఏఎస్‌పేట మండలం దూబగుంటలో రెండ్రోజుల క్రితం జరిగిన హత్య కేసులో కాశీవిశ్వనాథ్ అనే నిందుతుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. సంగం సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో సీఐ రవినాయక్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. ఏఎస్‌పేట మండలం దూబగుంటకు చెందిన సానా శ్రీనివాసులు, ఖాజావలి కూలీలు. ఈ నెల 2న కాశీవిశ్వనాథ్ పొలంలోకి పనికి వెళ్లిన సమయంలో ఇద్దరి మధ్యన చిన్నపాటి వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో 3న రాత్రి ఇంట్లో ఉన్న సానా శ్రీనివాసులను మధ్యస్థం చేస్తామని రచ్చబండ వద్దకు పిలిచి కాశీవిశ్వనాథ్ కత్తితో పొడిచి హత్యచేశాడని సీఐ తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. నిందితుడు చంద్రపడియ వద్ద ఉండగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఎస్‌పేట ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): యువకుడి గొంతు కోసిన ఘటనలో నలుగురు నిందితులను దర్గామిట్ట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలు..గత నెల 30న గంధ మహోత్సవం సందర్భంగా కోటమిట్టకు చెందిన షేక్ సాజిద్‌కు, భగతగ్‌సింగ్‌కాలనీకి చెందిన షేక్ అలీముర్తాజ్ అలియాస్ ముత్తు, కామాక్షినగర్‌కు చెందిన మహేష్ అలియాస్ చిన్న, బుజబుజనెల్లూరుకు చెందిన షేక్ మహబూబ్‌బాషా అలియాస్ రైడర్‌బాషా, మన్సూర్‌నగర్‌కు చెందిన పటాన్ ఫైరోజ్ అలియాస్ ఫల్లుల మధ్యన ఘర్షణ నెలకొంది. ఆ సమయంలో అందరూ సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. 31న వేకువన సాజిద్ ఇంటికి వెళుతుండగా కస్తూరీదేవి బాలికోన్నత పాఠశాల సమీపంలో నిందితులు సాజిద్‌ను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని నరసింహకొండకు తీసుకెళ్లారు. అక్కడ సాజిద్ గొంతుకోసి పరారయ్యారు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్సై బీ రమేష్‌బాబు శనివారం నిందితులు ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలో ఉండగా అరెస్ట్ చేశారు.

చంద్రబాబు సమావేశం వాయిదా

నెల్లూరు సిటీ: నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నీటిపారుదల రంగంపై మేధావులు, రైతులు, ఇతర వర్గాలతో శనివారం సాయంత్రం తలపెట్టిన సమావేశాన్ని ఆదివారం ఉదయానికి వాయిదా వేశారు. చంద్రబాబునాయుడు నెల్లూరుకు ఆలస్యంగా చేరుకోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాత్రి 8.20 గంటలకు ప్రకటించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కాగా శనివారం రాత్రి కస్తూరీదేవి గార్డెన్స్‌కు చేరుకున్న చంద్రబాబునాయుడు రూరల్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, జిల్లా నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇసుక రీచ్ వద్ద ఉద్రిక్తత

ఆత్మకూరు(సోమశిల):అనంతసాగరం మండలం పడమటికంభంపాడులోని పెన్నా నదిలోని ఇసుక రీచ్ వద్ద శనివారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు జనసేన పార్టీ కార్యకర్తలు ఇసుక రీచ్ నుంచి ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న టిప్పర్లను ఆపి పత్రాలు చూపించాలని బెదిరింపు ధోరణిలో వ్యవహరించారు. ఈ క్రమంలో వాహనదారులు, జనసేన కార్యకర్తలకు మధ్యన వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సోమశిల–బద్వేల్ మార్గంలో పదుల సంఖ్యలో టిప్పర్లు, లారీలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై నాయక్ తన సిబ్బందితో వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.జనసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

11లోగా ఎరువులకు నమోదు చేసుకోండి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): 2022- 23 పంట కాలానికి ఎరువులు కావాల్సిన పొగాకు రైతులు ఈ నెల 11లోగా నమోదు చేసుకోవాలని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు ఒక్కో బ్యారెన్‌కు డీడీ లేదా ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా రూ.8వేలు చెల్లిస్తే అమ్మోనియం సల్ఫేట్ 11, డీఏపీ 4, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 7, క్యాల్షియం నైట్రేట్ 7 బస్తాల చొప్పున అందజేస్తామని చెప్పారు. పొగాకు బోర్డు క్రాప్ కమిటీ ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తామని తెలిపారు. ఎరువులు అవసరమైన రైతులు సూపర్‌వైజర్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): చెడు వ్యసనాలకు బానిసైన మర్రిపాడు మండలం నాగినేనిగుంట పంచాయతీ మిట్టపాళెం గ్రామ వలంటీర్ నల్లిపోగు ఖాదర్‌బాబును విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ తెలిపారు. ఖాదర్‌బాబు పింఛన్ సొమ్ము రూ.56వేలు తీసుకుని అదృశ్యమవ్వడంతో అధికారులు శనివారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. వలంటీర్ తల్లితో పాటు బంధువులు రూ.56 వేల సొమ్మును పంచాయతీ కార్యదర్శికి అప్పగించగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా విధుల నుంచి వలంటీర్‌ను తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 150

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆత్మకూరు: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నువ్వూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం వేకువన మృతి చెందినట్లు ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు. వివరాలు..నువ్వూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన అశ్వర్ధదాసరి త్రినాథ్ (31) అవివాహితుడు. ఇటీవల మద్యానికి బానిసై గ్రామంలో ఖాళీగా తిరుగుతున్నాడు. గత నెల 31న మద్యం సేవించి ఇంటికి రాగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు వెంటనే జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువన మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతం నుంచి దాహం తీర్చుకునేందుకు శనివారం గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి కొద్దిసేపటికే మృతి చెందింది. స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించగా చుక్కల దుప్పికి పోస్టుమార్టం చేయించి అటవీప్రాంతంలో ఖననం చేశారు.

8న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిప్‌లైట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, క్యారిసాల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలోని ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసిన వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.





ఆ నలుగురు స్నేహితులు

ఇంగ్లీష్ సింగర్, సాంగ్ రైటర్, మ్యూజిషియన్, పీస్ యాక్టివిస్ట్ జాన్ లెనన్ తన 'ఇమేజిన్' పాటలో ఏం అంటాడు?

నీ తల మీద ఆకాశం తప్ప, స్వర్గనరకాలు, మతాలు, కులాలు, సరిహద్దు ద్వేషాలు లేని ఒక కొత్త ప్రపంచం, ఆస్తులు, అంతస్తుల తేడా లేని సరికొత్త సమాజాన్ని ఊహించుకో అంటాడు.

'ఐయామ్ ఏ డ్రీమర్ బట్ ఐయామ్ నాట్ ది వోన్లీ వన్' అని కూడా అంటాడు.

ప్రపంచంలో ఎంతోమందిలాగే ఈ పాటతో ప్రభావితమైన వాళ్లలో బెంగళూరుకు చెందిన నలుగురు స్నేహితులు ఉన్నారు. మెలిషా, వినోద్ లోబో, నితిన్ కుమార్, విగ్నేష్‌లు 'ఇమేజిన్' సాంగ్ స్ఫూర్తితో 'ఇమేజిన్ ట్రస్ట్' ప్రారంభించారు. సేవాకార్యక్రమాలకు సంబంధించి తొలి దశలో భాగంగా 'క్లాత్ బ్యాంక్'కు శ్రీకారం చుట్టారు. దాతల నుంచి సేకరించిన ఈ దుస్తులను పేదలు రూపాయి ఇచ్చి కొనవచ్చు.

ఫ్రెండూ... ఇదొక ట్రెండు!

friends forever

'స్నేహంలో విభేదాలు ఉండవు' అని అనుకోవడానికి లేదు. ఎన్నో కారణాల వల్ల ఫ్రెండ్‌షిప్ బ్రేక్‌డౌన్ కావచ్చు. మళ్లీ కలుసుకోవాలని, మునపటిలా హాయిగా మాట్లాడుకోవాలని ఉన్నా ఏవో ఇగోలు అడ్డుపడుతుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాశ్చాత్య దేశాల్లో 'ఇన్విజిబిలియా: థెరపీ విత్ ఫ్రెండ్స్' అనే ట్రెండ్ మొదలైంది. అనగా ఒక సైకాలజిస్ట్ విడిపోయిన ఇద్దరు స్నేహితులను ఒక దగ్గర కూర్చోబెట్టుకొని ఒకటి లేదా రెండు మూడు రోజుల సెషన్‌లతో వారి స్నేహాన్ని తిరిగి పట్టాలకెక్కిస్తారు.

'ఇదంతా ఎందుకు?' అనుకునేవారు దూరం అయిన ఫ్రెండ్‌కు 'సారీ రా' అని మెసేజ్ పెట్టి చూడండి చాలు...'సారీ'కి ఉండే పవర్ ఏమిటో మీకే తెలుస్తుంది!

వన్స్‌మోర్ ఫ్రెండ్‌షిప్ డైలాగ్‌లు



'నిజమైన స్నేహితులు కన్నీటి చుక్కల్లాంటి వారు. మనసు బాధగా ఉన్నప్పుడు చప్పున బయటికి వస్తారు'
'స్నేహంతో పని జరిగినప్పుడు, శత్రుత్వంతో పని ఎందుకు!'
– వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ముంబై సినిమా

నిజమైన స్నేహితుడు, స్నేహితుడి తప్పులను తన తప్పులుగా భావించి క్షమిస్తాడు.
– ఏ రస్తే ప్యార్ కే

స్నేహం అనేది ఎలా బతకాలో మాత్రమే కాదు ఎలా చావకూడదో నేర్పుతుంది.
– ఏబీసీడీ–ఎనీబడి కెన్ డ్యాన్స్

స్నేహితుడు చనిపోవచ్చు, స్నేహం చనిపోదు.
– ఎల్‌వోసీ కార్గిల్

స్నేహితులు ఉన్న వారే అసలైన సంపన్నులు
– రంగ్ దే బసంతీ

స్నేహంలోని ఒక నియమం...
నో సారీ...
నో థ్యాంక్!
– కుచ్ కుచ్ హోతా హై

కాలాతీత స్నేహ గీతం



స్నేహితుల దినోత్సవం సందర్భంగా అంతర్జాలంలో అలనాటి సినిమా 'దోస్తి' (1964) తప్పనిసరిగా ప్రస్తావనకు వస్తుంది. సత్యన్‌బోస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ కొట్టింది. 'బెస్ట్ ఫిల్మ్'తో సహా ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్‌లు గెలుచుకుంది.

ఒక యాక్సిడెంట్‌లో కాలు కోల్పోయిన రాము, కంటి చూపు లేని మోహన్ అనే ఇద్దరు కుర్రాళ్ల మధ్య స్నేహానికి అద్దం పట్టే చిత్రం ఇది. ఈ ఇద్దరు స్నేహితులకు పాట స్నేహితురాలు. అన్నదాత. ఎన్నో కష్టాలు, ప్రలోభాలు ఎదురైనా వారి స్నేహప్రపంచం చెక్కు చెదరదు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చూడాల్సిన సినిమాలలో ఇదొకటి.

వైరల్

ఔరా అమ్మకచెల్ల... భాంగ్రా స్టెప్పులు వేయడం ఇల్లా!



'ఆఫీసులో ఉద్యోగులు ఏం చేస్తారు?' అనే ప్రశ్నకు...

'ఆఫీసు వర్క్ చేస్తారు' అని మాత్రమే ఊరుకోనక్కర్లేదు. 'భాంగ్రా డ్యాన్స్ కూడా చేస్తారు' అని భేషుగ్గా చెప్పవచ్చు. ఎందుకంటే ఇదిప్పుడు ఒక ట్రెండ్‌గా మారనుంది. విషయంలోకి వస్తే... డల్ వర్క్‌డేకు ఒక కార్పొరేట్ కంపెనీ ఫన్ ట్విస్ట్ ఇచ్చింది.

'పనిచేసింది చాలు. ఇప్పుడిక భాంగ్రా నేర్చుకోండి' అంటూ ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్సర్ సాహిల్‌శర్మను ఆఫీసుకు తీసుకువచ్చింది.

'లెట్స్ డ్యాన్స్' అంటూ శర్మ భాంగ్రా స్టెప్పులు స్టార్ట్ చేయడంతో ఉద్యోగులు ఎవరి డెస్క్‌ల దగ్గర వారు అతడిని అనుసరించి డ్యాన్స్ చేయడం మొదలు పెట్టారు.

'ఐ వాంట్ యాన్ ఆఫీస్ లైక్ దిస్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో 2.9 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

'గుడ్ ఐడియా. 9 టు 5 జాబ్ వల్ల ఉద్యోగులు ఫిజికల్ యాక్టివిటీకి దూరం అవుతున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల వ్యాయామం చేసినట్లుగా ఉంటుంది. హుషారు వస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

దోసే వారు ఎవరురా!



మనసు దోచే దోసె గురించి ఎంత చెప్పినా తక్కువే. దోసె ప్రియుల కోసం సరికొత్త 'ఫుడ్ చాలెంజ్' ముందుకు వచ్చింది. 'ఆరడుగుల పొడవు ఉన్న దోసెను ఒక్క సిట్టింగ్‌లో తినగలరా?' అనే సవాలు విసురుతుంది ఈ ఫుడ్ చాలెంజ్. విజేత పొట్టశ్రమ వృథా పోదు. పదకొండు వేల రూపాయలను నగదు బహుమతిగా ఇస్తారు.

పాపులర్ బ్లాగర్స్ వాణి, సావిలు 'సమ్‌వన్ హు కెన్ ఫినిష్ దిస్?' ట్యాగ్‌తో పోస్ట్ చేసిన 'ఫుడ్ చాలెంజ్' 5.7 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఢిల్లీలోని పాపులర్ రెస్టారెంట్ 'దోసె ఫ్యాక్టరీ'లో ఈ ఆరు అడుగుల దోసెను తయారు చేయడంతోపాటు షూట్ చేశారు. మూడు రకాల మసాలాలు, నెయ్యితో తయారు చేసిన ఈ మెగా దోసెకు సాంబార్, చట్నీ, రవ్వ కేసరి కాంబినేషన్‌లుగా ఉంటాయి.

'టైమ్ లిమిట్ లేకపోతే ఈజీగా లాగించవచ్చు' అని కొందరు నెటిజనులు స్పందించారు.

ఖాకీ కిచెన్

కాసేపు లాఠీని పక్కనపెట్టి
గరిటను పట్టుకుందాం
అనుకుని కేరళలోని ఒక పోలీస్ స్టేషన్ వారు
ఈ వానల్లో
వేడివేడిగా వంట చేశారు.
వీడియో కూడా తీశారు.
వాళ్లు లొట్టలేసుకు తింటుంటే
నెటిజన్లు 'ఈ మాత్రం కళాపోషణ' ఉండాలి
అని మెచ్చుకున్నారు.
కాని పోలీసు బాసులు మాత్రం
వేరొకటి తలచారు.
ఏమా వంట? ఏమా వైరల్?

ఆ పోలీసులు ఇంట్లో వంట చేసుకుని ఉంటే బాగుండు. కాని వానాకాలంలో వేడివేడిగా ఏదైనా తినాలనిపించిందో ఏమో, కొంచెం బోర్‌ను బ్రేక్ చేద్దాం అనుకున్నారో ఏమో ఏకంగా స్టేషన్‌లోనే వంట చేశారు. ఆ చేయడం వీడియోలో షూట్ చేసి ఇన్‌స్టాలో పెట్టారు. చూసిన జనం ఈ మాత్రం సర్దా ఉండాల్లే అని ముచ్చట పడితే పోలీసు బాసులు మాత్రం కయ్యిమన్నారు. అసలేం జరిగిందంటే కేరళలోని ఇలవుంతిట్ట అనే స్టేషన్‌లో పోలీసులు వంట చేసుకు తిన్నారు. చికెన్‌ని తేవడం, ముక్కలు కొట్టించడం, కూర చేయడం, మటన్ కూర, దాంతో పాటు చిలగడదుంపల సంగతి కెమెరా ముందు అద్భుతంగా వండారు. పెద్ద పెద్ద అరిటాకులు తెచ్చి స్టేషన్ ఎస్.ఐతో పాటు అందరూ ఆరగించారు. దానికి మంచి పాట జత చేశారు. వీడియో సోషల్ మీడియాలో వదిలారు. ఇంకేముంది... జనం రకరకాల సరదా కామెంట్‌లు చేశారు. 'అప్పుడప్పుడు తినండోయ్... ఎప్పుడూ డ్యూటీయేనా' అన్నారు. కాని ఈ వీడియో పోలీస్ బాస్‌ల కంట పడింది. ఆ ఏరియా ఐ.జి 'ఈ విధంగా డ్యూటీలో వండుకు తినడం ఏ విధంగా విధులకు భంగకరం కాదో' వివరణ ఇమ్మని ఆదేశించాడు. మరి ఐ.జి గారికి ఎక్స్‌ప్లనేషనే పంపుతారో ఇంకో కూర వండి కూల్ చేస్తారో తెలియదు.





హెల్త్

పాదాల వాపు... పలు కారణాలు... పరిష్కారాలు!



సాధారణంగా ఏ బస్సులోనో చాలాసేపు కూర్చుని ప్రయాణం చేశాక... పాదాల్లో వాపురావడం చాలామందిలో కనిపించేదే. ఇది నిరపాయకరమైన వాపు. కానీ కొన్నిసార్లు అలా ఏ కారణం చేత ఆ వాపు వచ్చిందో తెలుసుకోడానికి డాక్టర్‌ను సంప్రదించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ వాపు కొన్నిసార్లు ప్రమాదకరం కావచ్చు. అప్రమత్తంగా ఉండాల్సి రావచ్చు. పాదాలవాపు కనిపించినప్పుడు ఏయే అంశాలపై దృష్టిపెట్టాలన్న అవగాహన కోసమే ఈ కథనం.

కాళ్లలో/పాదాల్లో వాపు కనిపించడాన్ని 'ఎడిమా' అంటారు. దీనికి చాలా కారణాలు ఉంటాయి. ముఖ్యంగా సెల్యులైటిస్, డీప్‌వీన్ థ్రాంబోసిస్ అనే కండిషన్లతో పాటు హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్... ఈ మూడు కీలక అవయవాల పనితీరు తగ్గడం వల్ల ఇలా జరిగిందేమో చూడాలి. హైపోథైరాయిడిజమ్ వల్ల కూడా ఇలా జరగవచ్చు. దాంతోపాటు కొన్ని మందుల వాడకంతో పాటు, అసలు ఏ కారణమూ తెలియకుండా కూడా పాదాల్లో వాపు రావచ్చు.

కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల...

కిడ్నీ ఫెయిల్యూర్‌లో ముఖం మాత్రమే ఉబ్బుతుందని చాలామంది అనుకుంటారు. కానీ కాళ్లవాపూ కనిపిస్తుంది. ఇలాంటప్పుడు కిడ్నీ ఫెయిల్యూర్ నిర్ధారణకు రీనల్ ఫంక్షన్ టెస్ట్ అనే పరీక్ష చేయించి, దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.

లివర్ ఫెయిల్యూర్ వల్ల...

కాలేయ వైఫల్యంలోనూ కాళ్ల వాపు కనిపిస్తుంది. దీని నిర్ధారణ కోసం 'లివర్ ఫంక్షన్ టెస్ట్ – ఎల్‌ఎఫ్‌టీ' పరీక్ష చేయించి, సమస్య నిర్ధారణ అయినప్పుడు దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.

కాలి సిరల్లో లోపంతో...

కొన్నిసార్లు కాళ్లలోని సిరలు చక్కగా పనిచేయకపోవడం వల్ల రక్తంలోని నీరు అక్కడే ఉండిపోయి, పాదాల వాపు రూపంలో బయటపడుతుంది. ఎక్కువసేపు నిల్చుని పనిచేసే వృత్తుల్లో ఉన్నవారిలో, ఊబకాయం ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువ. పిక్కల్లో నొప్పి, కాళ్లు బరువుగా అనిపించడం, అటు తర్వాత క్రమంగా కాళ్లపైనా, మడమ లోపలి వైపున నల్లటి మచ్చలు, కొంత కాలానికి కాలి సిరలు ఉబ్బి మెలికలు తిరిగి ఉన్నట్లుగా చర్మంలోంచి బయటికి కనిపించడంతో పాటు, అవి పచ్చగా లేక నల్లగా కనిపిస్తే, అది 'వేరికోస్ వెయిన్స్' లేదా ''వీనస్ ఇన్‌సిఫిషియెన్సీ' అనే కండిషన్ కావచ్చు. తొలి దశలో సాయంత్రం మాత్రమే ఉండే కాళ్లవాపు ఆ తర్వాత రోజంతా ఉంటుంది ● ఇది కాకుండా సెల్యులైటిస్ అనే కండిషన్‌లోనూ కాళ్ల వాపు కనిపిస్తుంది. అంతే కాదు.. ఇలా వాపు వచ్చిన కారణంగా కాలు కాస్త మెరుపుతో కనిపిస్తుంది ● దీనితో పాటు కాలి సిరల్లో రక్తం గడ్డకట్టడం వల్లకనిపించే 'డీప్ వీన్ థ్రాంబోసిస్ – (డీవీటీ)' అనే కండిషన్‌లో కూడా కాలివాపు కనిపిస్తుంది ● ఈ కండిషన్స్ అన్నింటి నిర్ధారణ కోసం కాలి సిరలకు వీనస్ డాప్లర్ టెస్ట్ అనే పరీక్ష చేయించాలి.

జాగ్రత్తలు / ఫస్ట్‌లైన్ చికిత్స :

● చాలాసేపు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ● వాపు ఉన్న కాళ్లపై ఎలాస్టిక్ స్టాకింగ్స్ తొడగాలి. ఈ జాగ్రత్తలతో కాలి వాపును నివారించవచ్చు. స్టాకింగ్ సిరలకు అది మంచి సపోర్ట్ ఇవ్వడం వల్ల క్రమేణా రక్తం సజావుగా ప్రవహిస్తుంటుంది. ఈ దశలో నిర్లక్ష్యం చేసి, సమస్య ముదిరి 'వేరికోస్ వెయిన్స్'గా పరిణమిస్తే, కాళ్లకు పుండ్లు వంటి దుష్ప్రభావాలు (కాంప్లికేషన్లు) రావచ్చు. ఆయా కండిషన్లకు అనుగుణంగా రేడియాలజీ చికిత్స, శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు.

కారణం తెలియకుండా...

కొందరిలో, ముఖ్యంగా 40 ఏళ్ల మహిళల్లో కాళ్ల వాపుతో పాటు మరి కొందరిలో ముఖం, చేతులు కూడా ఉబ్బడం జరగవచ్చు. ఇలా ఎందుకు జరుగుతుందన్న కారణం కొన్నిసార్లు తక్షణం తెలియకపోవచ్చు. వీరికి అన్ని పరీక్షలూ చేసి... నిర్దిష్టంగా ఎలాంటి కారణం లేదని తెలుసుకున్న తర్వాత డైయూరెటిక్స్ వాడాలి. ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవాలనీ డాక్టర్లు సూచిస్తారు.

ఇవేగాక... ఇతర సమస్యల్లో కూడా...

ఇక్కడ పేర్కొన్న సమస్యలతో పాటు అనేక ఇతర సమస్యల వల్ల కూడా కాళ్ల/పాదాల వాపు రావచ్చు. కొన్ని ప్రోటీన్ల లోపం, మహిళల్లో కటి భాగంలో వచ్చే క్యాన్సర్లలో కూడా కాళ్ల వాపు రావచ్చు. కొందరు గర్భవతుల్లో కాలి సిరలు సామర్థ్యం తగ్గడం, కొన్నిసార్లు థైరాయిడ్ హార్మోన్ లోపించినప్పుడూ వాపు రావచ్చు. ఇలాంటి సందర్భాల్లో జనరల్ ఫిజీషియన్‌ను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించడం, తదనుగుణంగా చికిత్సలు అవసరం.

ఊపిరితిత్తుల్లో రక్తపోటు పెరగడం...

ఊపిరితిత్తుల్లో రక్తపోటు పెరగడం వల్ల కూడా పాదాలకు వాపు వస్తుంది. ఊబకాయం ఉన్నవారిలో ఇది ఎక్కువ. ఈ కారణంగా సమస్య వస్తే... నిద్రలో పెద్దగా గురకపెట్టడం, నిద్రనుంచి అకస్మాత్తుగా లేవడం, నిద్రలో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడం కనిపిస్తాయి. వీరు తక్షణం డాక్టర్‌ను సంప్రదించాలి. లంగ్స్‌లో రక్తపోటు పెరగడాన్ని తెలుసుకోవడం కోసం డాక్టర్లు ఎకో పరీక్ష చేయిస్తారు. వయసు 40 దాటి, కాళ్ల వాపులు ఉన్నవారు ఒకసారి తప్పనిసరిగా ఎకో పరీక్ష చేయించడం మంచిది.

చికిత్స : ఊపిరితిత్తుల్లో రక్తపోటు కారణంగా వచ్చే స్లీప్ ఆప్నియాకు తప్పనిసరిగా చికిత్స చేయించాలి. దాంతో స్లీప్ ఆప్నియా సమస్య తగ్గి, కాళ్ల వాపూ తగ్గుతుంది.

గుండె పంపింగ్ తగ్గడం వల్ల...

గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గినప్పుడు పాదాల వాపు కనిపిస్తుంది. ఒక్కోసారి రక్తపోటు పెరగడమూ జరుగుతుంది. గుండెజబ్బు కారణంగా రెండు కాళ్లలోనూ వాపు కనిపిస్తుంది. ముందుగా కాలి ముందు భాగంలోనూ... ఆ తర్వాత మడమ భాగంలో వాపు వస్తుంది. మొదట్లో నొప్పి ఉండదు. ఆయాసం, నడవలేకపోవడం జరగవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణం మెడికల్ స్పెషలిస్ట్ / గుండె వైద్య నిపుణులను కలవాలి. గుండెజబ్బు వల్లనే పాదాల వాపు వచ్చిందా అన్న విషయం తెలుసుకోవడం కోసం బీఎన్‌పీ అనే రక్తపరీక్ష చేయించి, ఈ విలువ 100 కంటే ఎక్కువగా ఉంటే గుండె సమస్య ఉందేమోనని అనుమానించాలి. అప్పుడు గుండె నిపుణుల ఆధ్వర్యంలో ఈసీజీ, ఎకోకార్డియోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకోవాలి.

చికిత్స : ఇది గుండెజబ్బు కారణంగానే జరిగితే డైయూరెటిక్స్ అనే మందులు వాడాల్సి ఉంటుంది. ఇవి మూత్రం రూపంలో దేహంలోంచి నీటిని బయటకు పంపిస్తాయి. అయితే గుండె జబ్బు ఉన్నప్పుడు మాత్రమే ఈ డైయూరెటిక్స్ వాడాలి, లేకపోతే అవి ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అంతేకాదు... గుండెజబ్బు కాకుండా ఇతర కారణాల వల్ల కాలి వాపు వచ్చి ఉంటే... ఆ మూల కారణాన్ని కనుగొనే అవకాశం ఉండక, ఇతరత్రా సమస్యలు రావచ్చు.



డాక్టర్ జగదీశ్ కుమార్ .వి
సీనియర్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

రాడిక్యులోపతి అంటే...?



మెడలోని వెన్ను ఎముకలు అరిగి... అవి దగ్గరగా రావడంతో వెన్నుపూసల నుంచి వివిధ అవయవాలకు వచ్చే నరాలపై ఒత్తిడి పడుతుంటుంది. ఆ నొప్పిని 'స్పాండిలోసిస్' అంటారు. మొదట్లో అది స్పాండిలోసిస్ అని తెలియక నొప్పి నివారణ మందులు వాడుతుంటారు. కానీ అసలు సమస్య వల్ల కొద్ది రోజులు లేదా నెలల్లోనే నొప్పి మళ్లీ తిరగబెడుతుంది. మెడ నుంచి చేతి వరకూ పాకుతుంది. వేళ్లకు స్పర్శ తగ్గడం, తిమ్మిర్లలా అనిపిస్తుంది. అలాగే నడుము నుంచి కాళ్లలోకీ పాకవచ్చు. ఇలా ఈ నొప్పి చేతులూ, వేళ్లవరకూ పాకుతూ స్పర్శ కోల్పోయే పరిస్థితినీ, అలాగే నడుము నుంచి కాళ్లలోకి నొప్పి పాకడాన్ని ర్యాడిక్యులోపతిగా చెప్పవచ్చు.

రాడిక్యులోపతికి కారణాలు... చేతులు, కాళ్ల నొప్పుల రూపంలో ర్యాడిక్యులోపతి రెండు రకాలుగా వస్తుంది. మెడ దగ్గర సర్వైకల్ ఎముకల్లో నరాలు నలగడం వల్ల మెడ నుంచి చేతుల్లోకీ, అలాగే నడుము దగ్గర లంబార్ వెన్నుపూసల్లోంచి వచ్చే నరాలు నలగడం వల్ల నడుము నుంచి కాళ్లలోకీ నొప్పి పాకుతుంది. చేతి విషయానికి వస్తే... సమస్య స్టేజ్–1లో నొప్పి– భుజానికీ, చేతికీ పాకుతుంది. అదే స్టేజ్–2లో భుజం, చేయి ప్రభావితం కావడంతో పాటు చేతి వేళ్లకు స్పర్శ కొంతమేర తగ్గుతుంది. స్టేజ్–3కి చేరితే చేతి కండరాలు ఒకింత చచ్చుబడినట్లుగా కావచ్చు, వేళ్లు ముందులాగా చురుగ్గా కదిలించలేకపోవచ్చు. ఇక కాళ్ల విషయంలోనూ ఇలాంటి సమస్యలే వచ్చే అవకాశం ఉంది.

చికిత్స... డాక్టర్ సలహా మేరకు గాబాపెంటిన్ వంటి మాత్రలు నొప్పితీవ్రతను బట్టి రోజూ 2 – 3 వరకు తగిన మోతాదులో వాడాలి. అవసరాన్ని బట్టి అసెక్లోఫినాక్ వంటి నొప్పినివారణ మాత్రల్ని కూడా వాడాల్సి రావచ్చు. మందులతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడమే ర్యాడిక్యులోపతి చికిత్సలో మరీ ముఖ్యమైన అంశం.

జాగ్రత్తలు... ● పడుకునేటప్పుడు తలగడ కేవలం తల కింది వరకే కాకుండా, మెడకు సపోర్ట్ దొరికేలా భుజాల వరకూ ఉండేలా చూసుకోవాలి. ● తలగడ లేకపోతే బెడ్‌షీట్‌ను నాలుగు ఇంచుల ఎత్తుగా ఉండేలా మడత వేసి తల కిందా; అలాగే దాని మీద ఓ టర్కీ టవల్‌ను రోల్ చేసినట్లుగా చుట్టి మెడకింద పెట్టుకోవాలి. ● ఈ సమస్య ఉన్నప్పుడు కొందరు చెబుతున్నట్లుగా తలగడ లేకుండా పడుకోవడం అన్నది సరికాదు. తలగడ ఉండటం వల్లనే తప్పనిసరిగా మెడకూ, భుజాలకు సపోర్ట్ ఉంటుంది ● నడుము దగ్గర వచ్చే నొప్పి నివారణకు ముందుకు ఒంగకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి ● బరువైన వస్తువులు... అంటే నీళ్ల బకెట్లు, సూట్‌కేసులు, బ్రీఫ్‌కేసుల వంటివీ, అలాగే తలపైన మూటలు, గంపలు వంటి బరువైనవి ఎత్తుకోకూడదు.



డాక్టర్ సుధీర్ రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

గర్భవతుల్లో ఛాతీలో మంట తగ్గడం ఎలా? మెడిటిప్



గర్భవతుల్లో గుండెల్లో లేదా ఛాతీలో మంటగా ఉండటం, తేన్పులు, అజీర్తి ఫీలింగ్... ఇవన్నీ చాలా సాధారణంగా కనిపించే సమస్యలు. అయితే స్త్రీ, పురుషులు అనే భేదం లేకుండా చాలామందిలో ఈ సమస్య కనిపించినప్పటికీ గర్భవతుల్లో... మరీ ముఖ్యంగా ఐదారు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు ఈ లక్షణాలు ఎక్కువ.

కారణాలివి... గర్భవతుల్లో ప్లాసెంటా నుంచి ప్రొజెస్టెరాన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంటుంది. నెలలు నిండుతూ గర్భసంచిలో పిండం పెరుగుతున్న కొద్దీ... దానికి మరింతగా చోటు కల్పించడానికి గర్భసంచి కండరాలు వదులయ్యేలా చేయడం కోసం ప్రకృతిపరమైన ఏర్పాటిది. ఈ హార్మోన్ కేవలం గర్భసంచినే కాకుండా జీర్ణాశయం–అన్నవాహిక మధ్యన ఉండే 'లోవర్ ఈసోఫేజియల్ స్ఫింక్టర్'పైనా ప్రభావం చూపుతుంది. దాంతో ఆ స్ఫింక్టర్ వదులై, జీర్ణరసాలు పైకి ఎగజిమ్మడంతో గర్భవతుల్లో ఈ సమస్య కనిపిస్తుంది.

ఇవీ సూచనలు... ● ఆహారంలో కారం, మసాలాలూ, వేపుళ్లు పరిమితంగా తీసుకోవాలి. మజ్జిగ, పెరుగు వంటివి తీసుకోవాలి ● ఒకేసారి ఎక్కువ మోతాదుల్లో కాకుండా చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువసార్లు తినాలి ● భోజనం పూర్తికాగానే పడుకోకూడదు. కాసేపు అటూ ఇటూ తిరగాలి ● పడుకునే సమయంలో తలగడ పెట్టుకుని, తల కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి ● అప్పటికీ సమస్య తగ్గకపోతే డాక్టర్ల పర్యవేక్షణలో మాత్రమే యాంటాసిడ్స్ వాడాలి.